# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వచ్చే ఏడాది జనవరి 1 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను వ్యర్థ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో టమాటా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.**
5. **మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు నిర్వహిస్తోంది.**

==========================

వచ్చే ఏడాది జనవరి 1 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను వ్యర్థ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గత సాయంత్రం నిర్వహించిన “స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సం”లో ముఖ్యమంత్రి పాల్గొని 21 విభాగాల్లో 69 రాష్ట్ర స్థాయి, 12 వందల 57 జిల్లా స్థాయి అవార్డులు అందజేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర సాధ్యం కాకుండా.. స్వర్ణాంధ్ర సాధ్యం కాదని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్…34 సెకన్లు

అంతకుముందు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ.. పరిశుభ్రత ఒక జీవిన విధానంగా మారాలని, వ్యర్థాల నిర్వహణపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతోందని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే పౌర సేవల్లో వాట్సప్ గవర్నెన్స్ వినియోగం మరింత పెరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైం

గవర్నెన్స్ –ఆర్టీజీఎస్, పౌర సేవలపై నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పౌర సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయే ప్రభుత్వానికి ముఖ్యమని చెప్పారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్న 730 సేవల వినియోగం మరింతగా పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్య రంగంతో పాటు వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వినియోగం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటన నేపథ్యంలో డ్రోన్ సిటీకి ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన జరిగేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఢిల్లీలో ఆయన నిన్న మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై కొందరు సుప్రీంకోర్టులో కేసు వేశారని.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన కేసును న్యాయంస్థానం తోసిపుచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి పాటిల్ నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టుపై నిన్న జరిగిన సమీక్షలో ప్రాజెక్టు పురోగతి, నిధులు విడుదల, పునరావాసం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 29 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బకాయి నిధులు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి కోరారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలేతో మంత్రి నిన్న విజయవాడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. విదేశీ విద్య పథకానికి కేంద్రం 50 శాతం రాయితీ నిధులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలకు కేంద్రమంత్రి సానుకూలత వ్యక్తం చేశారని వీరాంజనేయ స్వామి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో టమాటా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు సరఫరా చేశామని, నిన్న పత్తికొండ మార్కెట్ నుంచి 10 మెట్రిక్ టన్నులు, చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్‌కు, 15 మెట్రిక్ టన్నులు రైతు బజార్లకు నిన్న పంపిణీ చేశామన్నారు. వర్షాల కారణంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు సరుకు రవాణా తగ్గిన నేపథ్యంలో టమాటా అమ్మకాలు మందగించాయని వివరించారు. ప్రస్తుతం టమాటాల

నాణ్యతను బట్టి రైతులకు మంచి ధర లభిస్తోందని, వారికి ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

మహర్షి వాల్మీకి జయంతి ఈరోజు. సంస్కృత ...., సాహిత్యాలలో నిష్ణాతునిగా పేరు పొందిన మహర్షి వాల్మీకి రామాయణ మహా కావ్యాన్ని రచించారు.

మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈరోజు నిర్వహించనున్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది నుంచి మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు అన్ని జిల్లాల కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయంతిని నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

---------------------------

దేశంలో వ్యూహాత్మక పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం కేంద్రంగా మారిందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా దేశంలోని ప్రధాన పెట్టుబడిదారులతో ముంబైలో నిన్న రోడ్ షో నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరించారు. విశాఖపట్నం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దక్షిణ తమిళనాడు తీర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావముందని వాతారవరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

..వాయిస్.. 23 సెకన్లు

తెలంగాణలోనూ ఈరోజు, రేపు ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================